శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## జిల్లాలో జనసేనను బలోపేతం చేయటమే లక్ష్యం



**నెల్లూరు,జులై11 ప్రభాతవార్త-విద్య** జిల్లాలో తమ పార్టీని బలోపేతం చేయటమే లక్ష్యంగా కృషిచేస్తామని జనసేన పార్టీజిల్లా నాయకులు నూనెమల్లికార్జునయాదవ్ పేర్కొన్నారు. నగరంలోని స్థానికమాగుంటల లేఅవుట్‌లో జనసేన పార్టీ జిల్లా ప్రదాన కార్యాలయ ప్రారంబోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నూనె మాట్లాడుతు జిల్లాలోని మెగా అభిమానులు, జనసేన నాయకులు, కార్యకర్తలు , చిరంజీవియువత సభ్యులు ఇలా అందిరిని కలుపుకుపోతూ పార్టీ బలోపేతానికి పాటుపడాతమన్నారు. తమ పార్టీ అధినేత, రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆశయ సాధనకోసం యువత పాటుపడాలని పిలుపునిచ్చారు. తమ పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ సారద్యంలో జిల్లా పార్టీని లాంచనంగా ప్రారంభించటం జరిగిందని, త్వరలోనే తమ పార్టీ రాష్ట్ర నాయకులు నాగబాబు ఆధ్వర్యంలో లాంచనంగా ప్రారంభించటం జరుగుతుందన్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు అవసరమైనఅన్నీ చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. పార్టీ కార్యాలయ ప్రారంబోత్సవం సందర్భంగా వీర మహిళలకు తాంబూలాలు అందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నాయకులు శ్రీరామ్, నాగరత్నం యాదవ్, మునిగిరి, ఏటూరి రవికుమార్, కృష్ణారెడ్డి, కృష్ణయ్య,వెంకటసుబ్బయ్య, శ్రీదర్, గుడి హరిరెడ్డి, ప్రవీణ్, గుర్రం కిషోర్‌బాబు, ప్రసాద్ యాదవ్, మురళీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## త్రిబుల్‌ఐటిలో చేజర్ల విద్యార్థుల హవా

**చేజర్ల జులై 11 ప్రభాతవార్త** చేజర్ల మండలంలో పదోగరతి పలితాలలో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు గురువారం విడుదలైన త్రిబుల్ ఐటిలో 6 మంది విద్యార్థులు ఎంపికైయ్యనట్లు మండల విద్యాశాఖాధికారి తెలిపారు. ఈ సందర్భంగా నాగులవెలటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఎన్,జ్యోత్స్నప్రియ, ఎన్ అమరేశ్వరీ ఎంపికైయ్యారు.అలాగే చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి వి.అబిరామ్,ఎస్‌కె సజనాభాను, ఎన్ సుజిత ఎంపికైయ్యారు.మామూడురు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల నుండి కె.మహిదర్ ఎంపికైనట్లు తెలిపారు. 6 మంది విద్యార్థులు త్రిబుల్‌ఐటిలో ఎంపిక కావడం పట్ల మండల విద్యాశాఖాధికారులు శ్రీనివా సులు,మస్తానయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,మండల యుటిఎఫ్‌నాయకులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## రైతు బజారులో సబ్సిడీపై నిత్యావసర సరుకులు :ఎమ్మెల్యే



**కందుకూరు జూలై 11, ప్రభాతవార్త,** కందుకూరు రైతుబజారు నందు నిత్యావసర సరుకులును సబ్సిడీపై అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు సబ్ కలెక్టర్ విద్యాదరి ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటా్లడుతూ కందిపప్పుపై రూ21లు, బియ్యంపై రూ6లు, పచ్చిబియ్యంపై రూ.5.50లు అసలు రేటుపై రాయితీ లబిస్తుందని ఆయనవివరించారు.సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులందరికి అందించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఒక్కొక్కరికి 5కిలోలు బియ్యం, కిలో కందిపప్పు అందచేస్తున్నట్లు వివరించారు.

**అపరిశుభ్రతపై ఎమ్మెల్యే ఆగ్రహం:** రైతు బజారు పరిసరాలు అపరిశుభ్రతగా ఉండడం పట్ల సంబందిత అధికారులుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్టేట్ ఆఫీసర్ పద్మనాభంపై మండిపడ్డారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

## రూ.55లక్షల విలువైన పనులకు శంఖుస్థాపన : ఎమ్మెల్యే

**కందుకూరు జూలై 11, ప్రభాతవార్త,** కందుకూరు పట్టణంలో గురువారం సుమారు రూ.55లక్షల విలువైన అభివృద్ధిపనులకు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంఖుస్ధాపన చేశారు. మున్సిపల్ ప్రత్యేక నిధులతో 2వవార్డు15.29లక్షలతో సీసీ రోడ్డు, 25వార్డు గాయత్రీనగర్‌లో 25.17 లక్షలతో డ్రైనేజి మరమ్మత్తులు, 32వ వరార్డులో చైతన్యవిద్యాలయం వెనుక రూ.14.53లక్షలతొ సీసీ రోడ్డు నిర్మాణ పనులుకు ఆయన కొబ్బరి కాయలు కొట్టి శంఖుస్ధాపన చేశారు.పనులు నాణ్యతాప్రమాణాలుతో చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో కమీషనర్ క్రిష్ణారెడ్డి, తెదేపా నాయకులు దారం మాల్యాద్రి, పొడపాటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటరమణ



**నెల్లూరు అర్బన్, జులై 11, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా నవాబు పేటలోని రైతు బజార్లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల, శాఖ ఆదేశాల మేరకు బియ్యం విక్రయా కేంద్రంని జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటరమణ జిల్లా ఆర్డిఓ మలోలతో కలిసి ఉదయం ప్రారంభించారు. ఈ కేంద్రంలో పచ్చి బియ్యం 48 రూపాయిలకు స్టీమ్ బియ్యం 49 రూపాయిలకు కందిపప్పు వర్తకులు కూడా పాల్గొన్నారు. కందిపప్పు విక్రయాలు, కిలో ధర, 160 రూపాయిలు ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా డిఎస్ఓ వెంకటరమణ తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ సద్వినియోగాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైస్, మిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## అన్ని పాఠశాలలో ఆధార్ క్యాంప్, పెట్టే విధంగా చర్యలు

**నెల్లూరు అర్బన్, జులై 11, ప్రభాతవార్త** గిరిజన ఆధార్ కేంద్రంలోని వెళ్లిన స్కూల్ పిల్లకి బయెమెట్రిక్ నమోదు, కరెక్షన్ చేయుటకి ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఒక్కక పిల్లలకి అర్ధగంట సమయం పడుతుంది. అలాగే ప్రభుత్వం పెట్టె స్కెమ్స్‌లో పిల్లల వేలిముద్రలు చాలా ముఖ్యం అయినాయి. స్కూల్ పిల్లలకి ఇబ్బందిగా ఉన్నందున అన్ని స్కూల్‌లో ప్రైవేట్, ప్రభుత్వ స్కూల్స్‌లో క్యాంప్స్ పెట్టి విధంగా ఐటిడిఏ వారు చర్యలు తీసుకోవాల్సిందిగా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టెంట్ రిజిస్టర్ వాళ్ళకి తెలియజేయాలని కోరారు.

## నారా లోకేష్‌ను కలిసిన ప్రభాకర్‌నాయుడు



**అనంతసాగరం,జులై11,ప్రభాతవార్త** : తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి , మంత్రి నారా లోకేష్‌బాబును అనంతసాగరం మండల యువ నాయకుడు , నెల్లూరు పార్లమెంట్ తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి కమ్మ ప్రభాకర్‌నాయుడు ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలను చర్చించారు. రేవూరు గ్రామంలో జరిగిన టిడిపి ఫ్లెక్సీల చించివేత వివాదం పట్ల లోకేష్‌బాబు ఆరాతీశారు. ప్రభాకర్‌నాయుడు పార్టీ కొరకు చేపట్టిన కార్యక్రమాలను లోకేష్‌కు వివరించారు.

## భూగర్భ జలాల అభివృద్ధి, యాజమాన్యా పద్ధతులపై శిక్షణ కార్యక్రమం




**నెల్లూరు అర్బన్, జులై 11, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో భూగర్భజలాలు పెంచే విధంగా కొత్త పథకాలకు ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులు ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కేంద్ర భూగర్భ జలమండలి ఆధ్వర్యంలో టైర్ త్రీ ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టే చెక్ డ్యాములు, వాటర్ షేడ్స్ ఎక్కువ స్థాయిలో భూగర్భ జలాలు నిలవలు ఉండే విధంగా డిజైన్లు తయారు చేయాలని ఆయన చెప్పారు. జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా శాఖ చేపట్టే పనులు భూగర్భజలాలు పెరిగే విధంగా సాంకేతిక అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్లానింగ్ చేయాలని ఆయన చెప్పారు. జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి రబీ, ఖరీఫ్ సీజన్లలో సాగునీరు వినియోగించుకునే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని ఆయన సూచించారు. కేంద్రీయ భూగర్భ జల మండలి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. ముందుగా జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితులను తెలియజేసే ఫోటో ప్రదర్శనను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమం లో కేంద్ర భూగర్భ జలమండలి డిప్యూటీ డైరెక్టర్ బి. కృష్ణమూర్తి, కేంద్ర భూగర్భ జల శాఖ శాస్త్రవేత్త రవికుమార్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసులు, డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్, జిల్లా భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్. శోభన్ బాబు, వ్యవసాయ, ఉద్యానవన, డ్వామ, డిఆర్‌డిఎ, ఏపీ మైక్రో ఇరిగేషన్ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలు ధైర్యంగా ఉండండి: కాకాణి



**మనుబోలు, జులై 11, ప్రభాతవార్త** 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా అధికారం కోల్పోవడం, నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని వైకాపా పార్టీ మాజీ వ్యవసాయ మంత్రి వర్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధైర్యం చెప్పారు. స్థానిక కోదండ రామ పురంలోని పద్మావతి కళ్యాణ మండపంలో గురువారం ఉదయం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గాల్లో వైకాపా అభ్యర్థులకు 45 శాతం ఓటింగ్ వచ్చిందని తెలిపారు. ఓటమి పాలైనప్పటికి నాయకులు, కార్యకర్తలు చేసిన కష్టం పట్ల ఆయన ధన్యవాదాలు చెప్పారు. అధికారంలోకి రాకపోయినా ఎవరు అధైర్యపడవద్దని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి చంద్రబాబు నాయుడు చేసిన అనేక వాగ్దానాలే కారణమని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ తగ్గలేదని తెలిపారు. మండలాల్లో, గ్రామాల్లో కాలనీల్లో తమ ఓటమికి కారణంపైన అధ్యయనం చేస్తామని ఈ ఐదేళ్ల ప్రజలకు అందుబాటులో ఉంటామని కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఎంత బిజీగా ఉన్న నాయకులు, కార్యకర్తలకు సమయాన్ని కేటాయిస్తామన్నారు. చంద్రబాబునాయుడు ఉచిత ఇసుక పైన కాకాణి విమర్శలు గుప్పించారు. విద్యుత్‌పైన చంద్రబాబునాయుడు విడుదల చేసిన శ్వేత పత్రంపైన అభ్యంతరం తెలిపారు. ఎంపీపీ గుండాల వజ్రమ్మ, వైకాపా సీనియర్ నాయకులు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, ఏడం మల్లిఖార్జునరెడ్డి, జడ్పీటీసీ అనితమ్మ, ఎంపీటీసీ దువ్వూరు రాజేశ్వరి, పార్టీ నాయకులు గుండాల ఆదినారాయణ,కసిరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, సర్పంచ్ ఉగ్గు మూడి శశిరెడ్డి, అనమాల ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ ఆవుల వెంకటరమణయ్య, ఎంపీటీసీ గుమ్మడి వెంకట సుబ్బయ్య, మరుపూరు మోహన్‌నాయుడు, కూరపాటి మోహన్, ఎస్‌కే చాంద్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

## హత్య జరిగిన రెండు రోజుల్లోనే నేరాన్ని చేధించిన కోవూరు పోలీసులు



కోవూరు, జూలై 10 ప్రభాతవార్త : కోవూరులోని రాళ్లమిట్ట ప్రాంతంలో మంగళవారం జరిగిన ఇరు వర్గాల ఘర్షణలో నాగరాజు అనే వ్యక్తి మృతిచెం దడం విధితమే. ఈ మేరకు ఈ కేసులో నిందితులను అరెస్టు చేయడంలో కోవూరు పోలీసులు కీలకపాత్ర పోషించారని ఇన్‌చార్జి రూరల్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. కోవూరులోని సీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారధి సెంటర్ గాంధీ గిరిజన కాలనీకి చెందిన శ్రీనివాసులు రమేష్ పి. నాగరాజులు రాళ్లమిట్టలో పందులు దొంగిలించేందుకు స్కూటీలో రావడం జరిగింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతానికి చెందిన రామకృష్ణ, తదితరులు వీరు పందుల దొంగతనానికి వచ్చారని గమనించి స్కూటీ వాహనం తాళాలు తీసుకుని ముగ్గురిని పట్టుకోబోగా కోటేశ్వరరావు మాత్రం పారిపోయాడు. దర్గయ్య, నాగరాజులు అక్కడే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో దొంగతనం జరగబోయే తీరును గాంధీ గిరిజన కాలనీలో ఉన్న గ్రామ పెద్ద పెంచలయ్య దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం తాము మంగళవారం కావడంతో పూజలో ఉన్నామని, పూజ అయిపోగానే 10.30 గంటలకు వస్తానని, అప్పుడు మాట్లాడుకుందామని, వారిద్దని పంపేయమని అన్నారు. గ్రామ పెదఇచ్చిన మాట కోసం ఇరువురిని పంపించేశారు. అయితే మరలా ఆ ముగ్గురు తిరిగి 10 గంటల ప్రాంతంలో రెండు వాహనాల్లో రాళ్లమిట్టకు వచ్చారు. ఈ సందర్భంగా తాము వచ్చిన స్కూటీని, స్కూటీలో ఉన్న సెల్‌ఫోన్ ఇవ్వాలని కోటేశ్వరరావు, దర్గయ్యలు రామకృష్ణ, తదితరులతో వాదోపవాదాలు వేసుకున్నారు. ఈ సమయంలో ముందుగా తమతో తెచ్చుకున్న కోటేశ్వరరావు, దర్గయ్య స్వైర విహారం చేశారు. ఒకవైపు నాగరాజు, మనం వచ్చింది సెల్‌ఫోన్ , బైక్ కోసమని, ఘర్షణ వద్దని నచ్చజెప్పబోయాడు. రామకృష్ణ, మరో రామకృష్ణలపై కోటేశ్వరరావు, దర్గయ్యలు కత్తులు తీసుకుని దాడి చేసి వారిరువురికి తీవ్రగాయాలు చేశారు. వారు పారిపోగానే వారిద్దరిని పొడవద్దని అడ్డుకోబోయిన నాగరాజును దర్గయ్య అదే కత్తితో ఎడమ ఛాతిపై పొడవగా తీవ్రగాయమై నాగరాజు అక్కడికక్కడే చనిపోయాడు. ఈ మేరకు నిందితులు ఇరువురిని గురువారం వారధి సెంటర్‌లో అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకుని సకాలంలో నిందితులను అరెస్టు చేసిన కోవూరు సీఐ టీవీ శ్రీనివాసరావు, కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. చాకచక్యంగా వ్యవహరించి ముద్దాయిలను అరెస్టు చేసిన వీరికి జిల్ల ఎస్పీ ఆదేశాల మేరకు రివార్డులు కూడా ప్రకటించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఎవరైనా ఇటువంటి దశ్చర్యలకు పాల్పడితే అటువంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్సై రంగనాథ్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

## ప్రతిసమస్యకు పరిష్కార దిశగా చర్యలు : ఎమ్మెల్యే కాకర్ల



**వింజమూరు,జులై11,ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గంలో నెలకొన్న ప్రతి సమస్యకు పరిష్కార దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చాకలికొండ పంచాయతీలో జరిగిన సాధారణ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు సర్పంచ్ ఉప్పురెట్ల సుబ్బలక్ష్మి , టిడిపి సీనియర్ నాయకులు కూనల వెంకటేశ్వర్లు, కాకర్ల హుసేన్ నాయుడు , దిండు మహేష్, ఉప్పురెట్ల వెంకటేశ్వర్లు , మాజీ సర్పంచ్ బోడిపూడి రత్నమ్మలు ఘనస్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్ ఫోటోలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అధికారులతో, బోర్డ్ సభ్యులతో సమావేశమయ్యారు. వార్డు, గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. సర్పంచ్ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నంగా ఉన్నప్పటికీ చంద్రబాబు నాయుడు కొన్ని వ్యవస్థలోని లోపాలను సరిచేసి సుపరిపాలన అందించాలనే సంకల్పంతో కృషి చేస్తున్నాడని, తాను కూడా వీలైనంతవరకు ప్రభుత్వ సహాయ సహకారాలతో నియోజకవర్గంలో అన్ని మండలాల్లో, పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. తాగునీరు, పంచాయతీ పరిధిలోని మౌళిక రోడ్లు, ఇతర అభివృద్ధి పనులపై దృష్టి సారించామన్నారు. అన్ని సమస్యల పరిష్కారానికి కొంత సమయం పడుతుందని తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానన్నారు. మబ్బు బుచ్చయ్య, మాల కొండయ్య, పుల్లయ్య, సన్నపురెడ్డి చినపెంచలరెడ్డి, మండల టిడిపి మాజీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, యన్నం రామచంద్రారెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, పేరం సుధాకర్‌రెడ్డి, ఎంపిడిఓ రాజేష్‌బాబు, సిడిపిఓ పద్మజ, వైద్యాధికారి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కమిషనర్ వికాస్ మర్మత్ వీడ్కోలు అభినందన సభ






**నెల్లూరు కార్పొరేషన్,జులై 11,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన వికాస్‌మర్మత్‌కు కార్యాలయంసిబ్బంది,వివిధ ఉద్యోగసంఘాల నాయ కులు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు గురువారం జరిగిన ఆత్మీయ అభినందన సభవీడ్కోలు కార్యక్రమంలో కమిషనర్ వికాస్‌మర్మత్‌ను నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు,సిబ్బంది,ఉద్యోగ సంఘాల నాయకులు అభినందించారు.ఈ సందర్భంగా వివిధ విభాగాల ఉన్నతాధికారులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విశిష్ట సేవా అవార్డులను అందుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.దాదాపు గడిచిన 15 నెలల కాలంలో కమిషనర్‌గా ఆయన చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు,సంస్కరణలు అభినందనీయం అని పలువురు ప్రశంసించారు.భవిష్యత్తులో తిరిగి నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా వికాస్ మర్మత్ బాధ్యతలు స్వీకరించాలని ఆకాంక్షించారు.

మున్సి పల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మున్సిపల్ కార్పొరేషన్,నెల్లూరు వారి ఆధ్వర్యంలో కమిషనర్ ను ఘనంగా సత్కరించి వినాయక ప్రతిమను బహుకరించారు.ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ మలోల,నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్,అదనపు కమిషనర్ శర్మద,డిప్యూటీ కమిషనర్ చెన్నుడు,సిటీ ప్లానర్ దేవీ కుమారి,మేనేజర్ ఇనాయతుల్లా,టి పి ఆర్.ఓ ప్రసాద్,తహసీల్దార్ వెంకటేశ్వర్లు,ఉద్యోగ సంఘాల నాయకులు శీనయ్య,రెవెన్యూ ఆఫీసర్లు,చక్రపాణి కృష్ణ కిషోర్,చిన్న బాబు,తదితరులు పాల్గొన్నారు.

## ఆక్వా రైతులకు అవంతి ఫీడ్స్ వారి అవగాహన సదస్సు



**కావలి రూరల్, జులై 11 ప్రభాతవార్త :** రొయ్యల మేతలలో దేశంలోనే అగ్రగామిగా వున్న అవంతి ఫీడ్స్ వారు రొయ్యల రైతుల శ్రేయస్సును ఉద్దేశించి రొయ్యల సాగులో ప్రధాన సమస్యలైన ఇహెచ్‌పి. వైట్‌గట్, రన్నింగ్ మోర్టాలిటి వంటి వ్యాధులపై అవగాహన సదస్సును గురువారం కావలి ముసునూరులోని శ్రీదేవి కన్వేషన్ హాలులో అవంతి సీనియర్ జనరల్ మేనేజర్ పరేష్‌కుమార్‌శెట్టి, జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మహంతి అధ్యక్షతన జరిగింది. ఈ అవగాహన సదస్సుకు ముఖ్యఅతిధిగా ప్రపంచ ప్రఖ్యాతగాంచిన రొయ్యల వ్యాధుల నిపుణులు థాయిలాండ్ కెపిస్టార్స్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రపంసాక్ రొయ్యల వ్యాధుల నివారణపై సాంకేతికంగా అవగాహన కల్పించారు. ఈ సదస్సులో పరేష్‌కుమార్‌శెట్టి, శ్రీనివాస్ మహంతిలు డీలర్లకు, ఆక్వా రైతులకు తగిన సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సదస్సులో నెల్లూరు అవంతి రీజనల్ మేనేజర్ నారాయణరెడ్డి, డాక్టర్ పి.శ్రీనివాసరావు, కావలి ఏరియా మేనేజర్ నాగేశ్వరరావు, రోహిణి ఆక్వా నీడ్స్ అధినేత వేలూరు జయచంద్రనాయుడు, కావలి ఆక్వా డీలర్స్, అవంతి సిబ్బంది, రొయ్యల సాగు రైతులు పాల్గొన్నారు.

## డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధుల నివారణకు గంబూజా చేపలు విడుదల



**కావలి రూరల్, జులై 11 ప్రభాతవార్త :** గంబూజా చేపలు నీటి గుంటలలో విడుదల చేయడం వల్ల డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులను కలిగించే లార్వాను ఈ చేపలు తినడం వల్ల ఈ వ్యాధుల తీవ్రతను అరికట్టవచ్చని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి నాగార్జున తెలిపారు. నెల్లూరు జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు కావలి రూరల్ మండలం సర్వాయపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సర్వాయపాళెం, ఆనెమడుగు సచివాలయాల పరిధిలోని ఎల్లాయగుంట,రామిశెట్టిగుంటలలో గురువారం గంబూజా చేపలు వదిలారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి లక్ష్మినరసయ్య, సర్వాయపాళెం పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ లక్ష్మి మాధురి, డాక్టర్ ప్రతిమ, ఎంపిహెచ్‌ఇవో, పిహెచ్‌ఎన్, హెల్త్ సూపర్‌వైజర్, యంయల్‌హెచ్‌పిలు, ఎఎన్‌యంలు, సచివాలయ సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## చుండి ఆదర్శపాఠశాల విద్యార్థుల ప్రతిభ



**కందుకూరు జూలై 11, ప్రభాతవార్త :** చుండి మోడల్‌స్కూలుకి చెందిన 4గురువిద్యార్థులు ట్రిబుల్ ఐటీఐలో మెరిటిప్రాతిపదికన సీట్లు సంపాయించారు. ఇందులో చుండికి చెందిన చెరవుపల్లి సాంబయ్య కుమారుడు సాయిపవన్, అంకభూపాలపురంకి చెందిన బొమ్మారెడ్డి జగన్‌రెడ్డి నూజివీడులోనూ, బండివారిపాలెంకు చెందిన నీలపాటిజ్యోత్స్న, కాకర్లపాలెంకు చెందిన దాసరి మనోజ్‌కుమార్‌లుకు ఒంగోలు నందు సీట్లు వచ్చినట్లు ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వరన్ తెలిపారు. విద్యార్థులన ఆయన అభినందించారు.

## సచివాలయాల ఆకస్మిక తనిఖీలు



**కలిగిరి, జూలై11, ప్రభాతవార్త :** కలిగిరి మండల యంపిడిఓ రంసుబ్బరాయుడు సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనితో యంపిడిఓ ఏరోజు ఏరోజు ఏ సచివాలయానికి వస్తాడో నని సచివాలయ శిబ్బంది బెంబేలెత్తుతున్నారు. ఈ క్రమంలో గురువారం మండలంలోని పోలంపాడు, పెద్దకొండూరు సచివాలయాల్ని తనిఖీలు నిర్వహించిన అదికారికి కొన్నిచోట్ల శిబ్బంది సమయానికి రాకపోవడం కంట పడింది. దీనితో మరొకసారి ఇలా జరిగితే చర్యలు తప్పవంటూ తెలపడం జరిగింది. ఇదేక్రమంలో సచివాలయ రికార్డులను క్షుణంగాపరిశీలించిన అదికారి రికార్డు వర్క్ సక్రమంగా ఉండాలని అటెండెన్స్, శిబ్బంది యూనీఫామ్ గురించి తెలియ జేశారు.

## కావలి పట్టణంలో ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కావలి, జులై 11 ప్రభాతవార్త :** కావలి పట్టణ మున్సిపాల్టీ పరిధిలో ఈ నెల 13వ తేది (రెండో శనివారం) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు గమనించాలని కావలి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.వసంతరావు తెలిపారు. ఉరుములతో కూడిన వర్షాల కారణంగా ప్రజలకు విద్యుత్ అంతరాయం కలగకుండా చెట్ల కొమ్మల వైర్లు మీద పడకుండా కొమ్మలను కొట్టడం, లైన్లు,ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, సబ్ స్టేషన్ మెయిన్‌టెనెన్స్‌కు సంబంధించి విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను బట్టి ముందుగానే నీళ్లను, మిగతా కార్యక్రమాలు సమకూర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాలు అయిపోయిన వెంటనే విద్యుత్ సరఫరా కొనసాగించడం జరుగుతుందని తెలిపారు

## పీఎం విశ్వకర్మ యోజన పథకం రుణం మంజూరు కావడం హర్షదాయకం

**నెల్లూరు టౌన్, జులై 11, ప్రభాతవార్త :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా లబ్ధిదారునికి మొట్టమొదటి సారిగా రుణం మంజూరు కావడం హర్షదాయకమని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు భాజన వెంకట శేషయ్య ఆచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని సంగం మండల స్టేట్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ మధుసూదన్‌రావు లక్ష రూపాయలు చెక్కు ఈ పథకం కింద పెనుబర్తి సురేష్ ఆచారి(కార్పెంటర్)కి అందజేశారని అన్నారు. చేతి వృత్తి దారులకు జీవన ఉపాధి అభివృద్ధి చేసుకునేందుక ఏర్పాటు చేసిన పీఎం విశ్వకర్మ యోజన పథకం ప్రవేశపెట్టిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు జిల్లాలో కార్పెంటర్‌కి తొలి లోన్ మంజూరు చేసిన బ్రాంచ్ మేనేజర్ కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణులు ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారని, వారి జీవన ఉపాధి అభివృద్ధి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ స్కీమ్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి ఈ స్కీమ్ గురించి అవగాహన కల్పించి వారితో ఆన్‌లైన్ చేపించి, తదుపరి ట్రైనింగ్, ట్రైనింగ్ రోజుల్లో స్టయిఫండ్ కింద రూ.4వేలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వృత్తి పనిముట్లు కొరకు రూ.15వేలు కూడా ఉచితంగా మంజూరు చేస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి బ్యాంకుల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని, కుల వృత్తిని నమ్ముకొని ఉన్న కార్పెంటర్ గోల్ స్మిత్, టైలరింగ్, వెల్డింగ్ తదితర చేతివృత్తిదారులందరికి తమ సహాయ సహకారాలు అందిస్తూ ప్రతి మండలంలో వారందరికి సహకారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. లోను తీసుకున్న లబ్దిదారులు ఈఎంఐలు సక్రమంగా కట్టుకుంటే తదుపరి రెండు లక్షలు ఆ తదుపరి మూడు లక్షలు ఈ స్కీమ్ ద్వారా రుణ సహాయం లబ్దిపొందవచ్చని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

## హెచ్చరికలను బేఖాతరు చేస్తున్న పార్సిల్ వాహనం



**ఉదయగిరి,జులై 11,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని బస్టాండ్ సెంటర్లో మరొకసారి శ్రీ సాయి కృష్ణ పార్సల్ వాహనం నిబంధనలకు విరుద్ధంగా బస్టాండ్ సెంటర్ మధ్యలో వాహనాన్ని ఆపి సరుకులు రవాణా చేయడానికి అక్కడ ఉన్న పలు ఫ్రూట్స్ అంగడివాళ్లు ఆందళోన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత అధికారులు పలుమార్లు హెచ్చరించిన పార్సల్ వాహనం యొక్క తీరు మార్చుకోలేదని యజమాని పోలీసు వారి హెచ్చరికలను పట్టించుకోవడం లేదని ఉదయగిరి సెంటర్లో ఎక్కడంటే అక్కడ వాహనాన్ని ఆపి సరుకులు దిగుమతి చేయడం గంటల తరబడి వాహనం ఆగిపోవడంతో పలు వాహనదారులు అండగి వారు ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు.పోలీస్ శాఖ కఠినమైన చర్యలు చేపట్టి పార్సల్ వాహన యాజమాన్యంపై చట్టపడిన చర్యలు చేపట్టాలని వారి సందర్భంగా కోరారు.వాహనాన్ని ఎక్కడంటే అక్కడ ఆపి సరుకులు దిగుమతి చేయడం వలన ఫీపర్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహన యాజమాన్యాన్ని కోరి ఎక్కడైనా ప్రజలకు ఇబ్బంది లేని చోట తమ కార్యక్రమాలను చేసుకోవాలని సూచిస్తే తమ మీద దౌర్జన్యంగా వర్తిస్తున్నారని అన్నారు. పోలీస్ శాఖ వారు కఠిన చర్యలు చేపట్టాలని వారి సందర్భంగా కోరారు.

## విద్యార్థులకు స్కూల యూనిఫాంలు పంపిణి



**చేజర్ల జులై 11 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని తూర్పు కంభంపాడు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థిని విద్యార్థులందరికి నూతన ప్రభుత్వం విద్యాకానుకకింద అందజేసిన స్కూల్ యూనిఫాం లు పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీనాయకులు మాజీ ఎంపిపి అన్నలూరు శ్రీనివాసులునాయుడు,కొమ్మి రమేష్‌నాయుడు, హాజరై ప్రధానోపాధ్యాయులతో కలసి విద్యార్థులకు యూనిఫాం పంపిణి చేయడం జరిగింది. పాఠశాలలో 140 మంది విద్యార్థులందరికి రెండు జతల యూనిఫాం అందజేశారు. అనంతరం శ్రీనివాసులునాయుడు మాట్లాడుతు విద్యార్థులు చిన్నతం నుండే భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమమైన విద్యను ఉపాధ్యాయులు అందించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవరచుకోవాలని అన్నారు. నూతన ప్రభుత్వం విద్యార్థులందరికి ఎన్నో ప్రోత్సహాకులు అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యానభ్యసించి ఎంతో మంది ఉన్నతస్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ కృష్ణయ్య, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు రవిచంద్ర, ఆదిశేషయ్య, సురేష్, చెంచమ్మ, జానకి, శోభారాణి సిబ్బంది పాల్గొన్నారు.

## సీతారామపురంలో వైద్యసిబ్బంది ర్యాలీ



**సీతారామపురం జులై 11 ప్రభాతవార్త :** సీతారామపురం ప్రభుత్వ వైద్యశాల నందు గురువారం ప్రపంచ జనాదినోత్సవం పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ ఎ.స్వప్న మాట్లాడుతు ఈ సంవత్సరం స్లోగన్ "బాల్యవివాహాలు వద్దు, సరైన వయస్సులో వివాహాలు ముద్దు", చిన్న కుటుంబం చింతలేని కుటుంబం, కాన్పుల మద్య ఎడం,తల్లి బిడ్డల ఆరోగ్యం మరియు తాత్కాలిక కుటుంబ నియంత్రన పాటించాలని చెప్పారు. మానవహారం చేసి ఈవిషయాలన్ని పాటిస్తామని ఇరుగు పొరుగువారికి అవగాహన కల్పిస్తానని ప్రతిజ్ఞ చేశారు. వైద్యశిబింది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నాళ్ళకెన్నాళ్ళకు..... నుడా అధికారుల తనీఖిలు



**బుచ్చి జులై 11 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలో పలు లేవుట్లు ను నుడా అధికారులు గురువారం తనీఖి చేశారు. అయితే ప్రజలు ఈ తనీఖిలు చూసి "ఎన్నాళ్ళకెన్నాళ్ళకు" నుడా అధికారుల తనీలు అంటు వ్యాఖ్యానిస్తున్నారు. కమీషనర్ రమణబాబు, పలువురు నుడా అధికారులు ఈ తనీఖిలు నిర్వహించారు. వారంరోజులు పాటు మండలంలోని అన్ని లేవుట్లు తనీఖి చేయనున్నట్లు తెలిపారు. జాయింట్‌డైరక్టర్ రాంబాబు, రీజనల్ డైరక్టర్ మధు,అసిస్టెంట్ డైరక్టర్ రవికుమార్, కమీషనర్ రమణబాబుతో లేవుట్‌లలో పరిశీలన చేశారు.

## పాలిటెక్నిక్ ప్రవేశాలకు కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం

**కావలి రూరల్, జులై 11 ప్రభాతవార్త :** పాలిటెక్నిక్ ప్రవేశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ అధికారులు విడుదల చేశారని కావలి రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీల్‌కుమార్ ప్రియ తెలిపారు. మొదటి కౌన్సిలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు ఈ నెల 11వ తేది నుండి 13వ తేది వరకు మూడు రోజుల పాటు విద్యార్థులు ఆన్‌లైన్ ప్రాసెసింగ్ కోసం ఫీజు చెల్లించాల్సి వుంటుందని తెలిపారు. ధృవపత్రాల పరిశీలన కూడా ఈ మూడు రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. రెండవ విడత ధృవపత్రాల పరిశీలన నెల్లూరు వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతాయని తెలిపారు. ఆప్షన్‌ల నమోదు కోసం ఈ నెల 11 నుంచి 14వ తేది వరకు కేటాయించారని తెలిపారు. మొదటి కౌన్సిలింగ్ పూర్తయిన విద్యార్థులకు ఆప్షన్ ఎంపిక కూడా ఇదే సమయం కేటాయించారని తెలిపారు. సీట్లు ఎలాట్‌మెంట్‌కు ఈ నెల 16వ తేది నిర్దేశించగా 18వ తేది నుండి 20వ తేది వరకు ఆన్‌లైన్ విధానంలో విద్యార్థులు సెల్ఫ్ జాయినింగ్ అయ్యే కళాశాలలో రిపోర్టు చేయాల్సి వుంటుందని ఆయన తెలిపారు.

## మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఐ. కరుణకుమార్

### హెల్మెట్ ధరించి ప్రాణరక్షణ పొందాలి



**కోవూరు జూలై 10 ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలని కోవూరు ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి , మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఐ. కరుణకుమార్ అన్నారు. కోవూరులోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకుండా జాతీయ రహదారిలో ప్రయాణించడం వలన ప్రమాదాలు జరిగే సమయంలో మృత్యువాత పడుతున్నారన్నారు. కేవలం హెల్మెట్ లేని కారణంగానే అనేకమంది ఈ ప్రమాదాల కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాహనం నడపాలన్నారు. కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులు, సిబ్బంది కూడా హెల్మెట్ ధరించి మిగతా వారికి ఆదర్శం కావాలన్నారు. జాతీయ రహదారిలో ప్రమాదాల కారణంగా అనేక కుటుంబాలు కూడా ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు కూడా ఈ హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## వేల కోట్లకు అధిపతులైన వారు నా భూమిని ఆక్రమించి పెట్రోల్ బంకు పెట్టారు !

### బాధితుడు మంగిలపూడి వెంకటేశ్వరరెడ్డి గగ్గోలు



**కావలి, జులై 11 ప్రభాతవార్త :** కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అనుచరులను అడ్డంపెట్టుకుని వేల కోట్లకు అధిపతులైన వారు నా భూమిని అక్రమంగా ఆక్రమించి చట్టవిరుద్ధంగా పెట్రోల్ బంకును పెట్టుకున్నారని బాధితుడు మంగిలపూడి వెంకటేశ్వరరెడ్డి గగ్గోలు పెట్టారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. కావలి రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటేశ్వరరెడ్డి పాల్గొని తనకు జరిగిన అన్యాయంపై వాపోయారు. కావలి పట్టణం ముసునూరు గ్రామ సర్వే నెం.154,158,162లలో 2 ఎకరాల భూమిని పట్టణంలో పేరున్న ముక్కాల సునీత, గుర్రం నవీనలతలు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అనుచరులు కలిసి దురాక్రమణ చేశారని వెంకటేశ్వరరెడ్డి ఆరోపించారు. తన భూమిని ఆక్రమించిన వారు వేల కోట్లకు అధిపతులై వున్నారన్నారు. గ్రామ విఆర్వో, రెవెన్యూ అధికారులను లోబర్చుకుని రికార్డులు మార్చి ఆక్రమించారన్నారు. తాను రెవెన్యూ కోర్టుకు వెళితే జిల్లా కలెక్టర్ ఈ కేసును సిసిఎల్‌ఎలో పెట్టారన్నారు. ఇక తాను చేసేదేమి లేక హైకోర్టును ఆశ్రయించానన్నారు. ఈ భూమికి సంబంధించి స్టేటస్‌కో ఆర్డర్ తెచ్చుకున్నానన్నారు. సదరు భూమిలో కోర్టు ఆదేశాల మేరకు ఎవరు ప్రవేశించకూడదన్నారు. కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేసి ముక్కాల సునీత, గుర్రం నవీనలతలు తన భూమిలోని 9 సెంట్ల భూమిని ఆక్రమించారన్నారు. ముసునూరులో కొత్తగా పెట్రోల్ బంకు పెట్టారని ఆరోపించారు. దౌర్జన్యంగా, అక్రమంగా తన భూమిని ఆక్రమించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ప్రస్తుత కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తన భూమిని తనకు ఇప్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి మాజీ ఎమ్మెల్యే అనుచరుల బారి నుండి తన భూమిని ఇప్పించాలని ఆయన కోరారు.

## పలు ఉత్తరక్రియలలో పాల్గొని నివాళులర్పించిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, జులై 11 ప్రభాతవార్త :** కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గురువారం జరిగిన పలు ఉత్తరక్రియల కార్యక్రమాలలో పాల్గొని నివాళులర్పించారు. కావలి పట్టణ 9వ వార్డులో పట్టణానికి చెందిన లేబాకుల సుధాకర్‌రెడ్డి, లేబాకుల వెంకట శేషారెడ్డిల పెద్దకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య పాల్గొని చిత్రపటాలకు పూలు వుంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. 9వ వార్డు శివాలయం వీధిలో వంటేరు రమణమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమెకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కావలి పట్టణ 29వ వార్డు జనతాపేటలోని దివంగత ప్రధానోపాధ్యాయులు ఎన్.ఆర్.కుమారస్వామి భార్య నాగసూరి వనజ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే కావ్య నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బోగోలు మండలం ఏనుగులబావికి చెందిన పంది పెనుగొండయ్య కుమార్తె ప్రవీణ ఉత్తరక్రియలలో ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించారు. కావలి ఒంగోలు బస్టాండ్ సమీపంలో ప్రవీణ నివాసానికి వెళ్లి చిత్రపటం వద్ద పూలు వుంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## మినగల్లు ఇసుక యార్డు వద్ద ట్రాక్టర్ల యజమానుల ఆందోళన



**బుచ్చి జులై 11 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ఇసుకయార్డు వద్ద ట్రాక్టర్ యజమానులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లు యజమానులు మాట్లాడుతు అధికారులు టిప్పర్లకే ప్రాధన్యత ఇస్తామని చెబుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ట్రాక్టరుకు తప్ప రెండో ట్రాక్టర్‌కి అనుమతి ఇవ్వడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముందు ఈజిల్లాలో ఉండే వారికి ఇవ్వాలా ? లేక పక్క జిల్లా వారికి ఇవ్వాలా అని వారు ప్రశ్నించారు. ఒక్క ట్రిప్పుతప్ప రెండో ట్రిప్పు రావద్దని అధికారులు అనడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఒక్క ట్రిప్పు తోలితే మాకు ఏమిరాదు. కనీసం రెండు మూడు ట్రిప్పులు ట్రాక్టర్లకు ఇచ్చే విధంగా చూడాలని వారు కోరారు.

## రోటరీ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సత్కరించిన జనవిజ్ఞాన వేదిక



**కావలి రూరల్, జులై 11 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని రవి నర్సింగ్ హోమ్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జనవిజ్ఞాన వేదిక కార్యవర్గ సభ్యులైన ఎస్.స్వర్ణలత, మొగల్ సలీంబేగ్‌లు కావలి పట్టణ రోటరీ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా వారిని దుశ్సాలువతో సత్కరించి పూలమొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జెవివి సభ్యులను రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎంపిక చేయడం చాలా సంతోషంగా వుందని తెలిపారు. రోటరీ క్లబ్ చేసే కార్యక్రమాలలో భాగస్వామ్యులవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, కోశాధికారి టి.సుబ్బరాయశర్మ, జిల్లా రోటరీ క్లబ్ బాధ్యులు డాక్టర్ కె.మాధవరెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ డాకారపు రవిప్రకాష్,జెవివి ఉపాధ్యక్షులు కె.హరినారపరెడ్డి, సి.కల్లయ్య, జిల్లా కార్యదర్శి జి.కళ్యాణి, జెవివి పట్టణ సంయుక్త కార్యదర్శులు సి.శారద, ఎస్.కె.ఖాదర్‌బాషా, గుణకల శివయ్య, కావలి రూరల్ మండల అధ్యక్షులు ఎ.పద్మనాభం, చన్నా వెంకట్రామయ్య, జెవివి సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి



**బిట్రగుంట, జులై 11 ప్రభాతవార్త :** బోగోలు మేజర్ పంచాయతీలోని చెంచులక్ష్మీపురం గ్రామానికి చెందిన పేరం కోటయ్య(65) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు బిట్రగుంట పోలీసులు తెలిపారు. మృతుడి కుమార్తె పాలకీర్తి మమత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తన తండ్రి తోటలలో కరివేకు లాంటి వస్తువులు తీసుకొని అమ్ముతుంటాడని గురువారం ఉదయం ఆరున్నర ప్రాంతంలో బిజ్జం కోటారెడ్డి, బిజ్జం భాస్కర్‌రెడ్డిల పొలాల వద్ద కరెంటు షాక్‌తో మృతి చెందాడన్నారు. ఈయన వెంకారెడ్డి మామిడి తోటలో పనిచేసేవాడన్నారు. ఈ ఘటనపై తమకు అనుమానం వుందని ఫిర్యాదులో పేర్కొనడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆదరణ కేంద్రానికి వితరణ



**బిట్రగుంట, జులై 11 ప్రభాతవార్త :** బోగోలు మండలం నాగులవరం గ్రామానికి చెందిన కాండ్ర యువనేస్తం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్ర సతీష్‌నాయుడు గురువారం ఆదరణ కేంద్రానికి 15 వేల రూపాయలు విలువ చేసే నిత్యావసర వస్తువులు వితరణగా అందజేశారని ఆదరణ కేంద్ర డైరెక్టర్ డాక్టర్ కె.సింహాద్రిరావు దంపతులు తెలిపారు.కావలి నియోజకవర్గంలో పలు మండలాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సతీష్‌నాయుడు గత మూడు సంవత్సరాలుగా ఆదరణ కేంద్రానికి వితరణగా నిత్యావసర వస్తువులు ఇవ్వడాన్ని వారు ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి

**నెల్లూరు, జులై 11, ప్రభాతవార్త – వైద్యం :** నవలాకుల తోటలో ఉన్న రోడ్ల సమస్య, నీటి సమస్య, సైడ్ కాలువ సమస్యలని యుద్ధ ప్రాతిపదికన వారంలోగా పూర్తి చేయాలని ఆ డివిజన్ ఇంచార్జి ఎండి జావిద్ అధికారులకు తెలియజేశారు. గురువారం ఆ డివిజన్‌లో జావిద్ సమస్యకు పరిష్కారం అనే కార్యక్రమంలో భాగంగా నవలాకుల తోటలో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జావిద్‌కు చెప్పడంతో అక్కడికక్కడే అధికారులతో ఫోన్లో మాట్లాడి అది వెంటనే వారంలోగా ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారుల్ని సూచించారు. రోడ్లు మరమ్మత్తులు వీధిలైట్లు సమస్యని తక్షణమే పూర్తి చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. నవలాకుల తోట ప్రజలు తాము గెలిపించుకున్న టిడిపి పార్టీ స్థానిక టిడిపి ఇంచార్జి ఎండి జావిద్ ఇంటింటికి వచ్చి తమ సమస్యలను అడిగి మరీ పరిష్కరిస్తున్నారని స్థానిక నవలాకులతోట ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జావిద్, సిహెచ్ సుబ్బారామయ్య, బబు, సర్దార్, తిరుమల, జమీర్, రిజ్వాన్, ఆదిత్య ఖాజా, గాయాజ్, తదితర టిడిపి కార్యకర్తలు అభిమానులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బడి బయటి పిల్లలు బడిలో ఉండాలి




**వరికుంటపాడు, జూలై 11,ప్రభాతవార్త :** బడికి దూరంగా ఉంటున్న ప్రతి పిల్లవాడిని బడిలో ఉంచడం కోసమే నేను బడికి పోతా కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వరికుంటపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరభద్రయ్య అన్నారు.గురువారం స్థానిక పాఠశాల నుండి బస్‌స్టాండ్ సెంటర్ లో విద్యార్థులు పిల్లలు బడికి- పెద్దలు పనికి అంటూ నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించి,సెంటర్ లో మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వీరభద్రయ్య మాట్లాడుతూ బడి బయట ఉంటే డ్రాపౌట్స్ పిల్లలను బడులకు తీసుకువచ్చి,విద్యాభ్యాసం సాగించేలా అవగాహన కల్పిస్తున్నామనీ అన్నారు.ప్రతి పిల్లవాడు మంచి చదువులు చదువుకొని,ఉన్నత స్థానంలో నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు చంద్రమౌళి,మౌళాలి,పోలుబోయిన ఉప్పు కొండయ్య యాదవ్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంట సాగుదారు హక్కు పత్రం పై అవగాహన సదస్సు



**కొడవలూరు జూలై 11 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం, రామన్నపాలెం, కొడవలూరు గ్రామాలలో పంట సాగుదారు హక్కు పత్రం పై అవగాహన సదస్సు కారక్రమాని గురువారం మండల వ్యమ సాయ శాఖ అధికారి లక్ష్మి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎడిఎ సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమె కౌవులు చేసే రైతులకు సబ్సిడీ విత్తనాలు మరియు బ్యాంకుల నుంచి ఋణాలు పొంద వచ్చనీ వారు తెలిపారు. రైలందరూ సంబంధిత గ్రామ విఎఎను మరియు విఆర్‌వోను సంప్రదించి కార్డు పోందవలసిదగా సూచించారు. ఈ కార్యక్రమంలో విఎఎ నిహారిక, రామన్నపాలెం సర్పంచ్ కాకి శ్రీనివాసులు మరియు రైతులు పాల్గోన్నారు.

## కౌలు రైతు కార్డుల వలన అనేక ఉపయోగాలు



**కోవూరు జూలై 10 ప్రభాతవార్త :** వ్యవసాయాన్ని సాగుచేసే కౌలు రైతులు పొలాలను లీజుకు తీసుకుని వారు చేసే సమయంలో ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా పంట నష్టం జరిగితే పరిహారం పొందడానికి ఈ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. కోవూరు మండలం వేగూరు గ్రామ పంచాయతీలో గురువారం కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు వారు పండించిన ధాన్యాన్ని విక్రయించడానికి ఈ కార్డులు ఎంతో అవసరమన్నారు. అదేవిధంగా పంట భీమా చేసేందుకు ఈ కౌలు రైతు కార్డులు ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పొలాలను లీజుకు తీసుకుని సాగు చేసే కౌలు రైతులంతా ఈ కౌలు రైతు కార్డులు పొందాలని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి కౌలు రైతు కార్డుల వలన ఏమేమి ఉపయోగాలు ఉన్నాయో వారికి పూర్తిగా వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, గ్రామ రెవెన్యూ అధికారి మల్లికార్జున, వ్యవసాయ సహాయకులు సుభాషిణి, టీడీపీ సీనియర్ వేగూరు సుబ్బానాయుడు, రైతులు ఉన్నారు.

## అధిక జనాభా అనర్థాలపై వేపినాపిలో విద్యార్థులచే మానవహారం



**వేపినాపి(రాపూరు), జూలై11ప్రభాతవార్త :** అధిక జనాభా వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ రాపూరు మండలంలోని వేపినాపి గ్రామంలో జిల్లా పరిషతన ఉన్నత పాఠశాల విద్యార్థులచే మానవాహారం నిర్వహించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ప్రమిలా రాజకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక జనాబా వల్ల కలిగే అనర్థాలు వివరించారు. అధిక జనభా నివరాణకు తీసుకోవల్సిన కుటుంబ నియంత్రణ అవస్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లింగమూర్తి, పలు వురు ఆరోగ్య కార్యకర్తలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## అకిలివలసలో వ్యక్తిగత మరుగుదోడ్లు పరిశీలన



**అకిలివలస(రాపూరు), జూలై11ప్రభాతార్త :** మండలంలోని అకిలివలస గ్రామంలో గురువారం వ్యక్తిగత మరుగుదోడ్లను కలువాయి యంపీడీఓ ఆధ్వర్యంలో పలువురు అధికారులు పరిశీలించారు. ఓడిఎఫ్ ప్లస్ గ్రామ పంచాయితీల తనిఖీలలో బాగంగా ఈ పరిశీలనలు నిర్వహించారు. ఇందులో బాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలలు,గృహాలలో వినియోగిస్తున్న వ్యక్తిగత మరుగుదోడ్లు పరిశీలించారు. గ్రామంలో బహిరంగ మలమూత్ర విసర్జన నిరోధం ఎ విధంగా జరుగుతుంది అన్న విషయాలను పరిశీలించారు.ఈ పరిశీలనలో కలువాయి యంపీడీఓ,ఆర్‌డబ్యూఎస్ రాపూరు,కలువాయి ఎఇలు అంజనేయలు, రాపూరు, కలువాయి యం.ఆర్.సిలు కె.రమేష్,పంచాయితీ కార్యదర్శులు రమేష్,క్రిష్ణ,సచివాలయం సిబ్బంది వున్నారు.

## దోమల నివారణకు కాలువలలో గంబూసియా చేపలు



**రాపూరు, జూలై11ప్రభాతవార్త :** మలేరియా జ్వరాల నివరణలో బాగంగా దోమలను నిర్మూలించేందుకు రాపూరులోని పలు నీటి కాలువలలో గంబూసియా చేపలను గురువారం వేపినాపి పిహెచ్‌సి ఆరోగ్య సిబ్బంది వదిలిపెట్టారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సూర్యధర్మేంద్ర ఆధ్వర్యంలో మద్దెలమడుగు సెంటర్‌లో వున్న వాగులో గంబూసియా చేప పిల్లలను వదిలిపెట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గంబూసియా చేప పిల్లలను కాలువలలో వదలడం ద్వారా అవి దోమల లార్వను తిని వేయడం జరుగుతుందన్నారు. దిని వల్ల దోమల ప్రత్యుత్పతి నశిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ లింగమూర్తి, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఆరోగ్య కార్యకర్త సన్యాసమ్మ, ఆశా చిన్నమ్మ తదితరులున్నారు.

## అక్కంపేటలో వాటర్‌ప్లాంట్‌పై ఫ్లెక్సీ వివాదం

**మనుబోలు, జులై 11, ప్రభాతవార్త :** మండలంలోని అక్కంపేట గ్రామంలో గురువారం ఉదయం వాటర్ ప్లాంట్‌పై ఉన్న ఫ్లెక్సీ బోర్డులపైన వివాదం చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇక్కడ వాటర్ ప్లాంట్ వద్ద బుధవారం సాయంత్రం ఎన్టీఆర్ జలధార బోర్డును టీడీపీ నేతలు ఎన్టీఆర్ జలధార ఫ్లెక్సీ పెట్టారు. దీంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నేత నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. 2017లో ఇక్కడ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరుతో స్వర్గీయ కి.శే నారపరెడ్డి సీతారామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్ రెడ్డి సొంత నిధులతో వాటర్ ప్లాంట్‌ను స్థాపించారు. అనంతరం ఆయన వైకాపా వీడి కాంగ్రెస్ పార్టీలో చేరాడు. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి గెలిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ గ్రామ టీడీపీ నాయకులు పి.రామ్‌మోహన్‌రెడ్డి, ఏలూరు కోదండ రామిరెడ్డి తన అనుచరులతో వాటర్ ప్లాంట్ వద్దకు వచ్చి తాము వాటర్ ప్లాంట్‌కు వ్యతిరేకం కాదని, తెలుగుదేశం పార్టీలో అధికారంలోకి వచ్చిన తరువాత తమ నాయకుడు ఫ్లెక్సీ పెట్టమన్నామని డిమాండ్ చేశారు. దీనికి కిరణ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎట్టి పరిస్థితుల్లో తన తల్లి సర్పంచ్ నారపరెడ్డి జాంబవతమ్మ, ఇక్కడ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి పంచాయతీ తీర్మాణం అనుమతులు ఉన్నాయని చెప్పారు. దీనిపై హైకోర్టుకు వెళ్లి తేల్చుకుంటానని కిరణ్‌రెడ్డి తెలిపారు. ఎస్సై అజయ్‌కుమార్ రంగంలోకి వచ్చిన తరువాత ఇద్దరి సమక్షంలో నాయకులను సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. ఎంపీడీఓ లేనందున ఈ వాటర్ ప్లాంట్‌పై ఫ్లెక్సీ వివాదాలను ప్రస్తుతానికి వాయిదా వేద్దామని చెప్పారు. ప్రస్తుతానికి వాటర్ ప్లాంట్‌లో ఫ్లెక్సీలు ఉండకూడదని ఫ్లెక్సీలు తీయించివేశారు. అలాగే ఎంపీడీఓ వచ్చేవరకు వాటర్ ప్లాంట్ మూసేయాలని ఎస్సై ఆదేశాల మేరకు వాటర్ ప్లాంట్‌కు తలుపులు వేశారు. దీంతో రెండు వర్గాల నాయకులు చేసేది లేక సర్దుకుపోయారు. దీనిపై కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన తల్లి జాంబవతమ్మ పేరుతో హైకోర్టులో ఫిల్ వేస్తామని చెప్పారు. తెలుగుదేశం నాయకుడు రామ్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ నీటి సరఫరాకు అడ్డుకోలేదని, కేవలం ఫ్లెక్సీని తొలగించాలని కోరామని చెప్పారు. రెండు వైపులా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇక్కడ గంట సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది.

## ట్రిపుల్ ఐటికి విద్యార్థులు ఎంపిక





**వరికుంటపాడు, జూలై 11,ప్రభాతవార్త :** మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పి.మాలకొండయ్య తెలిపారు. పదవ తరగతి లో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన కుండా మధుసూధన్ (586) నూజివీడు ట్రిపుల్ ఐటికి ఎంపిక కాగా,అదే పాఠశాలకు చెందిన గొరిగే శ్రీ తేజ (568) ఒంగోలు ట్రిపుల్ ఐటికి ఎంపికైంది.ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు అనేక సంవత్సరాలుగా పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడమే కాక ట్రిపుల్ ఐటిలకు ఎంపిక అవుతున్నారు.ఈ సంవత్సరం కూడా ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపిక కావడం పై ప్రధానోపాధ్యాయులు పి.మాలకొండయ్య,ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఎంపికైన విద్యార్థులను అభినందించారు.ఈ ఇద్దరు విద్యార్థులు టి.కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వారు కావటంతో గ్రామస్తులు విద్యార్థులను తల్లిదండ్రులను అభినందించారు.

## తిరుమలకు మహాపాదయాత్ర

**మనుబోలు, జులై 11, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రావడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదవి అలంకరించడం వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనంద్‌బాబు విజయఢంకా మోగించడంతో ఆయన అనుచరులు 60మంది తిరుమలకు మహాపాదయాత్ర చేపట్టారు. వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు గ్రామానికి కే.మధుసూదన్‌ప్రసాద్ నేతృత్వంలో 60మంది జులై 1వ తేదీ మొక్కుబడి చెల్లించుకునేందుకు తిరుమలకు మహాపాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి స్థానిక కోదండరామపురం చేరుకున్నారు. స్థానిక సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మనుబోలు తెలుగుదేశం పార్టీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, కలికి రమేష్‌రెడ్డి వీరికి స్వాగతం పలికారు. స్థానిక పద్మావతి లాడ్జిలో వీరికి బస ఏర్పాటు చేశారు. తిరిగి గురువారం ఉదయం ఈ మహాపాదయాత్ర బృందాన్ని తిరుమలకు సాగనంపారు. వీరి వెంట టీడీపీ నాయకులు మారంరెడ్డి రమణారెడ్డి, కలికి సుధీర్‌రెడ్డి, ఏ.దామోదర్‌రెడ్డి, రేవూరు సుమంత్, పుట్టా మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## బలవర్ధకమైన పౌష్టికాహారం తప్పక తీసుకోవాలి



**కోవూరు జూలై 10 ప్రభాతవార్త :** గర్భవతులు, బాలింతలు తప్పనిసరిగా బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నిరంజన్ తెలిపారు. కోవూరు పంచాయతీ పరిధిలోని మూడవ సచివాలయం ప్రాంతంలో గురువారం ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోకపోతే కాన్పులు కూడా కష్టమయ్యే పరిస్థితి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తప్పనిసరిగా పాలు, గుడ్లు, ఆకుకూరలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం కూడా సమపాళ్లలో తీసుకోవాలన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత ద్వారా అతిసార నివారణ



**బోజ్జనపల్లి(రాపూరు), జూలై11ప్రభాతవార్త :** పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడంతో పాటు,వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అతిసార వ్యాధిని నివారించవచ్చని రాపూరు మండలంలోని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సూర్యధర్మేంద్ర తెలిపారు. గురువారం ఆయన మండలంలోని బోజ్జనపల్లి సమీపంలో వున్న శ్రీ వెంకటేశ్వరా ప్రభుత్వ పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలోని విద్యార్థులకు అతిసార వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దీంతో పాటు ఓ.ఆర్.ఎస్ ద్రావణం వినియోగం,జింక్ టాబ్‌లేట్లు, విటమిన్ ఎ తీసుకోవడం,పరిసరాలు ఆపరిశుభ్రత వల్ల వచ్చే వ్యాధులు అవి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మలమూత్ర విసర్జన జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎటువంటి ఆహారం తీసుకోవాలి,ఎటువంటి ఆహారం తీసుకోరాదు అన్న విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినీలకు మినిస్ట్రీవల్ హైజిన్ గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిరమ్మ, కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ శ్రీహరి, సిబ్బంది శివ,నారాయణ, వెంకటేష్, గురవయ్య, ఆరోగ్యకార్యకర్త విజయలక్ష్మి, సిహెచ్‌ఓ సరితా కుమారి, ఆశా లక్ష్మమ్మ, 104 సిబ్బంది, విద్యార్థినీ,విద్యార్థులు వున్నారు.

## బాలికల వసతి గృహంలో సమస్యల తిష్ట



**కోవూరు, జూలై 11 ప్రభాతవార్త :** సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించడమే కాకుండా క్రమం తప్పకుండా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశాలు ఇస్తున్నా వాస్తవ రూపంలో అవి కాగితాలగానే మిగిలిపోతున్నాయి. ఫలితంగా విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ సమస్యలతో కాలయాపన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కాదు.. కోవూరు నియోజకవర్గ మండల కేంద్రమైన కోవూరు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో నెలకొంది. మొత్తం ఈ ప్రాంగణంలో సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి మూడు బాలికల వసతి గృహాలు వేరువేరుగా ఉన్నాయి. సాంఘిక సంక్షేమ వసతి గృహం-3లో గత సంవత్సరం వంట గది పక్కనే ఉన్న ప్రహరీ గోడ పూర్తిగా పడిపోయినా ఇంతవరకు దానిని మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ఫలితంగా ఆ వైపు నుంచి యథేచ్ఛగా పందులు, కుక్కలు ఈ వసతి గృహంలో తచ్చాడుతున్నాయి. ఫలితంగా విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా బాలికల వసతి గృహం-1 లో బాలికల మరుగుదొడ్లు పక్కనే ఉన్న ప్రహరీ గోడ పడిపోయింది. ఈ పడిపోయిన పక్కనే కాలనీతో పాటు పొలాలు కూడా ఉన్నాయి. రాత్రి వేళ గానీ పగటి వేళ గానీ మరుగుదొడ్లకు వెళ్లాలంటే తీవ్రంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడప్పుడు ఆ ప్రాంతం నుంచి పలువురు ఆకతాయిలు అల్లరి చేసే పరిస్థితి కూడా నెలకొంది. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ వసతి గృహాల్లో ఈ విధమైన సమస్యలు ఏర్పడినా సంబంధిత జిల్లా సంక్షేమ అధికారుల్లో మాత్రం ఇసుమంతైనా స్పందన లేకపోవడం దారుణం. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఈ వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థుల్లో ధైర్యం చెప్పాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది. ఈ విషయమై ఏఎస్‌డబ్ల్యూ తిరుపతయ్యను ప్రభాతవార్త వివరణ కోరగా.. ఇదివరకే ఈ విషయాన్ని జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. - ఎమ్మెల్యేగారూ మీరైనా పరిశీలించాలి. 400 మందికి పైగా సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే వారికి ఆశించిన మేర రక్షణ కొరవడడంతో ఇక్కడకు వస్తున్న తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు వసతి గృహాలకు సంబంధించి ప్రహరీ గోడ ప్రధాన ప్రాంతాల్లో పడిపోయి రెండు సంవత్సరాలు కావస్తున్నా సంబంధిత జిల్లా సంక్షేమాధికారుల్లో ఆశించిన మేర స్పందన లేదని వారు వాపోతున్నారు. రాత్రి వేళల్లో తమ బిడ్డలు బిక్కుబిక్కుమంటూ నిద్రించాల్సిన పరిస్థితి ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఒకసారి ఈ వసతి గృహాలను పరిశీలించి తమ బిడ్డలకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు కోరుతున్నారు.

## కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు అందజేయండి



**వరికుంటపాడు, జూలై 11,ప్రభాతవార్త :** కౌలు రైతులకు వ్యవసాయంలో సంపూర్ణ మద్దతు అందించడంలో భాగంగా అర్హులైన కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు అందజేయడం జరుగుతుందని టిప్యూటి తహశీల్దార్ నిమ్మల చెంచయ్య,మండల వ్యవసాయాధికారి రవికుమార్ లు అన్నారు.గురువారం స్థానిక తహశీల్ధార్ కార్యాలయంలో గ్రామ రెవిన్యూ అధికారులు,గ్రామ వ్యవసాయ సహాయకులకు పంటసాగు పత్రాలు ఇవ్వటంలో తీసుకోవాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసిఆర్సి కార్డు మంజూరు చేయడం పై భూ యజమానులకు ఉండే అపోహలపై వివరించాలనీ,కౌలు రైతులకు తమ భూమిని యజమానులు 11 నెలల కాల వ్యవధి తో కౌలుకు ఇచ్చేలా అవగాహన కల్పించడం కోసం ప్రత్యేక సదస్సులు ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు.సిసిఆర్సి కార్డు వలన కౌలు రైతులకు పంట సాగు చేసుకునేందుకు మాత్రమే హక్కు కలిగి ఉంటారని అలాగే కౌలు రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు,పంట నమోదు,పంట రుణాలు,పంటల భీమా తో పాటు,పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి ప్రభుత్వం నుండి లభిస్తుందన్నారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రవికుమార్ మాట్లాడుతూ మండలంలో వరి బిపిటి5204 రకము,కంది ఎల్‌ఆర్‌జి-52 మరియు ప్రొద్దు తిరుగుడు విత్తనాలు అందుబాటులో ఉన్నాయనీ కావాల్సిన రైతులు విఎఎ లను సంప్రదించాలని అన్నారు.

## నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ప్రపంచ జనాభా దినోత్సవం




**బుచ్చి జులై 11 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నారాయణ ఇంగ్లీషు మీడియ స్కూల్‌లో ప్రపంచ జనాభాదినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిఫల్ షేక్.ఇస్మాయిల్ ప్రపంచ జనాభా, వాటివల్ల సమస్యల గురించి వివరించారు. నారాయణ విద్యాసంస్దల జిఎం విజయబాస్కర్‌రెడ్డి,ఎజిఎం కె.రవివర్మ సూచనల మేరకు ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు. విద్యార్ధులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇస్మాయిల్ మాట్లాడుతు గతంలో ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం చైనా కాగా ప్రస్తుతం భారతదేశం ఆ స్దానంలోకి వచ్చిందని అన్నారు. రోజు రోజుకి జనాభా పెరుగుతు పోతు వారికి అవసరమైన సదుపాయాలు దొరకడం కష్టమౌతుందని అన్నారు. జనాభా పెరుగుదల వల్ల, నివాసాలు, ఆహారం, అన్ని సమస్యలు ఏర్పడతాయని ఆయన పేర్కున్నారు. ప్రజలందరు కూడా అవగాహనతో జనాభా తగ్గుదలకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎ.ఒ కృష్ణమోహన్,వైస్ ప్రిన్సిఫల్ సుహాసిని,కీర్తి, పదోతరగతి ఇన్‌చార్జి ప్రవీణ్,అకడమిక్ డీన్ రాజశేఖర్ ఉపాధ్యాయ బృందం పాల్గోన్నట్లు ఆయన తెలిపారు.

## బుచ్చిలో కోనకార్పస్ చెట్లు తొలగింపు



**బుచ్చి జులై 11 ప్రభాతవార్త** ప్రజల ఆరోగ్యానికి హానికరమైన కోనకార్పస్ చెట్లను బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని డివైడర్‌పై తొలగింపుకు కమీషనర్ రమణబాబు శ్రీకారం చుట్టారు. ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్ ఇటీవల ఈ చెట్ల గురించి మాట్లాడుతు ఈ చెట్లు చాలా ప్రమాదకరమని చెప్పడం కూడా జరిగింది.అలాగే ఇటీవల జరిగిన కౌన్సిలర్ల సాధారణ సమావేశంలో కూడా కౌన్సిలర్లు ఈ చెట్లను తొలగించాలంటు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.దీంతో స్పందించిన నగర కమీషనర్ కోనాకార్పస్ చెట్లు తొలగింపుకు శ్రీకారం చుట్టారు.

## వ్యవసాయ కార్యాలయాన్ని ప్రక్షాళన చేస్తా జెడిఎ సత్యవాణి



**అల్లూరు, జులై 11 ప్రభాతవార్త** అల్లూరు వ్యవసాయ కార్యాలయాన్ని ప్రక్షాళన చేస్తానని జెడిఎ సత్యవాణి తెలిపారు. అల్లూరు వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. అల్లూరు వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారి అందుబాటులో లేకపోగా రైతులు కార్యాలయానికి విచ్చేసినప్పుడు కార్యాలయం ముందు బీరు బాటిళ్లు, చెత్తాచెదారాలు వున్న దృశ్యాలు నా దృష్టికి వచ్చిందని అందువల్ల ఈ కార్యాలయాన్ని సందర్శించడం జరిగిందని అక్కడకు విచ్చేసిన రైతులతో సత్యవాణి తెలిపారు.అనంతరం రైతులు చెప్పిన పలు విషయాలను చర్చించారు. వ్యవసాయాధికారి ఎప్పుడు అల్లూరులో వుండరని, సిబ్బంది సైతం రైతులకు ఎటువంటి సమాచారం అందజేయరని జెడిఎకు రైతులు తెలిపారు. పంటల అల్లూరుగా పేరుగాంచిన అల్లూరులో రెండు తెలుగు రాష్ట్రాలలో అతి పెద్ద ఆయకట్టు విస్తీర్ణం గల అల్లూరు చెరువు నుండి నీటి పారుదలతో పంటలు పుష్కలంగా పండే ఈ ప్రాంతంలో అల్లూరు వ్యవసాయాధికారి అందుబాటులో వుండరని వారు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆమె త్వరితగతిన పూర్తి స్థాయిలో వ్యవసాయాధికారిని నియమిస్తారని ఆమె తెలిపారు. అలాగే వ్యవసాయ సిబ్బంది అందుబాటులో లేరని చెప్పడంతో వారి స్థానంలో కూడా కొత్త సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. పచ్చరొట్ట విత్తనాలు త్వరితగతిన అందజేయాలని రైతులు కోరారు.ఈ విత్తనాలు కొంత మంది రైతులకు ఇస్తున్నారని, అసలు పచ్చరొట్ట విత్తనాలు వచ్చిన విషయాన్ని తెలియజేయడం లేదని రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలో కావలి ఎడిఎ నాగరాజు, ఎవో రామకృష్ణ, రైతులు మేడా శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కత్తుల కిరణ్, రామిశెట్టి కృష్ణచైతన్య, మేడా నిరంజన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## జనాభా నియంత్రణతోనే దేశాభివృద్ధి డీఎంహెచ్‌ఓ




**నెల్లూరు, జులై 11, ప్రభాతవార్త – వైద్యం** కుటుంబ నియంత్రణ పద్ధతులు ఆచరిస్తూ ఒక్కరూ లేదా ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకుని జనాభా నియంత్రణలో భాగస్వామ్యం అయితేనే దేశాభివృద్ధి జరుగుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డిఎంహెచ్ఓ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ వైద్యశాఖ కార్యాలయం నుంచి ములుముడి బస్టాండ్, బీఈడి కళాశాల మీదుగా తిరిగి జిల్లా వైద్యశాఖ కార్యాలయం వరకు జరిగింది. అనంతరం డిఎంహెచ్ఓ కార్యాలయంలో అవగాహన సభ జరిగింది. జనాభ నియంత్రణలో భాగస్వాములవుదామని డాక్టర్‌లు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ భూమి, నీరు, పొలాలు, గ్యాస్, బొగ్గు తదితర సహజ వనరులన్నీ పరిమితంగా ఉంటాయన్నారు. జనాభా పెరిగితే సహజ వనరులు వినియోగించుకోవడంలో ఇబ్బందులు తప్పదన్నారు. అందువల్ల తప్పని సరిగా జనాభా నియంత్రణ జరగాలని లేదంటే సమతుల్యం దెబ్బతింటుందన్నారు. జనాభా నియంత్రణలో భాగంగా బాల్య వివాహాలను అరికట్టాలని, యుక్తవయస్సులో మాత్రమే పెళ్లిళ్లు జరిపించాలన్నారు. బిడ్డ, బిడ్డకు ఎడమ ఉండే విధంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. ఇదే సందర్భంలో కుటుంబ నియంత్రణ పాటించిన వారిలో లక్కీడిప్ ద్వారా మొదటి బహుమతి కింద రూ. 5 వేలు చొప్పున ముగ్గురుకి, రెండో బహుమతి కింద రూ. 4 వేలు ముగ్గురికి అందించారు. ఎక్కువగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేసిన వారిలో మొదటి బహుమతి కింద డాక్టర్ పిహెచ్ కిరణ్‌కు రూ. 8 వేలు, రెండవ బహుమతి కింద డాక్టర్ పద్మావతికి రూ. 5 వేలు, పీపీ యూనిట్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు ప్రత్యేక బహుమతి అందించారు. అలాగే ప్యామిలీ ప్లానింగ్ కౌన్సిలర్, ఏఎన్ఎం, ఆశాలకు రూ. 2,500 చొప్పున అందించారు.అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి, డిఐఓ డాక్టర్ ఉమా మహేశ్వరి, డాక్టర్ రమేష్, డెమో అధికారి శ్రీనివాసరావు, డిప్యూటి డెమో అధికారి కనకరత్నం, ఎన్ఓ సహన, డిహెచ్‌పి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## త్రిబుల్‌ఐటికి ఎంపికైన విద్యార్దులకు ప్రశంసలు



**కలువాయి జులై 11 ప్రభాతవార్త** కలువాయిలోని బి.వి.ఎన్ఆర్ జడ్‌పి హైస్కూల్ నందు త్రిబుల్‌ఐటికి ఎం పికైన విద్యార్ధినులు హర్షిని,వెం గ మ్మ, అదే విధంగా చీపినాపి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్దిని షేక్.తాసిపా, విద్యార్దిని ట్రిపుల్‌ఐటి ఇదు పులపాయలో ఎంపికైయ్యారు.ఈ సందర్భంగా కలువాయి జడ్‌పిపై స్కూల్ ప్రధానోపాధ్యాయు లు ఉపాధ్యాయులు,పిసి కమీటి చైర్మన్ విద్యార్దులను ప్రశంసించారు.

## నరసపనాయుడుకు జీవిత కాల సాఫల్య అవార్డు




**మర్రిపాడు, జులై11, ప్రభాతవార్త :** టొబాకో ఇన్స్‌ట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఉత్తమ రైతు పురస్కార కార్యక్రమంలో డిసిపల్లి పొగాకు వేలంకేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు గాలి నరసపనాయుడుకు జీవిత కాల సాఫల్య అవార్డును రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురంధరేశ్వరి , ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్‌కుమార్‌లు అందించారు. ఈకార్యక్రమంలో పలొగాకుబోర్డ్ చైర్మెన్, వైస్ చైర్మెన్, టిఐఐ డైరెక్టర్ శరద్‌తండన్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, పొగాకు బోర్డు సెక్రటరీ దివి వేణు గోపాల్, అన్ని వేలం కేంద్రాల రైతులు, వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

## దాతల సేవలు ఆదర్శనీయం : డిబిజిడబ్ల్యుఒ




అనంతసాగరం,జులై11,ప్రభాతవార్త : గ్రామంమీద మమకారంతో ప్రవాసభారతీయులు బోయిళ్ళ జనార్ధన్‌రెడ్డి రేవూరు బిసి బాలికల వసతిగృహ విద్యార్థినిల ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించి లక్షలాది రూపాయలు తన సొంత నిధులతో డార్మెటరీ నిర్మించడం ఆదర్శనీయమని జిల్లా బిసి సంక్షేమాధికారి వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం అనంతసాగరం మండలం రేవూపు బిసి బాలికల వసతిగృహంలో గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు బోయిళ్ళ జనార్ధన్‌రెడ్డి లక్షలాది రూపాయలు తన సొంత నిధులతో బాలికలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేలా డార్మెంటరిని ఏర్పాటు చేశారు. తన భార్య బోయిళ్ళ లక్ష్మీతేజ జ్ఞాపకార్ధం తమశ్రీతేజోసాయి ట్రస్ట్ ద్వారా నిర్మించిన డార్మెంటరీని వారి కుమార్తె బోయిళ్ళ సాయిప్రవర్తిక ప్రారంభించారు. ఈసందర్భంగా దాతలు జనర్ధానప్‌రెడ్డి, సాయి ప్రవర్తికలను జిల్లా బిసి సంక్షేమాధికారి , ఎబిసిడబ్ల్యుఒ ఎం.శ్రీదేవి, సంక్షేమాధికారి మల్లీశ్వరిలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ డబ్బుకంటే కాలం చాలా విలువైందని, కాలాన్ని వృథా చేయకుండా ఉజ్వల భవిష్యత్తుకోసం కష్టపడి చదివి తల్లిదండ్రులకు ,పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. తన భార్య సాయితేజ జ్ఞాపకార్ధం వసతిగృహంలో డార్మెంటరీని నిర్మించడం అదృష్టంగా భావిస్తున్నా మన్నారు. విద్యార్ధి దశనుండి కష్టపడి చదివి ఉత్తమ స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అల్లంపాటి వెంకటేశ్వర్‌రెడ్డి, బోయిళ్ళ కొండారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కె.యల్లారెడ్డి, రవిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జనాభా నియంత్రణపై యువతకి అవగాహన అవసరం



**నెల్లూరు,జులై11 ప్రభాతవార్త–విద్య** జనాభా పెరుగుదల సామాజిక, పర్యావరణ వ్యక్తిగత ప్రయోజనాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని దీనిని నివారించేదుకు యువతకు జనాభా నియంత్రణపై అవగాహన అవ్సక ఉండాలని ఆర్ఐఒ, డికె జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని స్థానిక డికె జూనియర్ కళాశాలలో సెట్నెల్,నెహ్రూయువ కేంద్ర, సమగ్రశిక్షల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జనాబాను నియంత్రిచకుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. నెహ్రూ యువకేంద్ర కో ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసరావులు మాట్లాడుతు ప్రజలు, యువత జానాభా నియంత్రణ చర్యలతోపాటూ కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా యువత మంచి ఉపాది అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు. జనాభా నియంత్రణ ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమౌతుందని తెలిపారు.అనంతరం విదా ్యర్థులకు వ్యాసరచన, వక్తృత్వం , పెయిటింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కొండయ్య, కరుణకుమారి, ప్రసన్న, భారతి, సెట్నల్ అధికారి గయాజ్ అహ మ్మద్, లెక్చరర్స్ వెంకటేశ్వర్లు, రవీంద్రనాద్, చంద్రకళ, శ్రీదేవి, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మరిన్ని నగరాల్లో ఉబెర్ సేవలు

**నెల్లూరు,జులై11 ప్రభాతవార్త–విద్య** త్వరలో రాష్ట్రంలోని మరిన్ని నగరాల్లో తమ సేవలను ప్రారంభిం చనున్నామని ఉబెర్ ఇండియా, దక్షినాసియా రీజినల్ బిజినెస్ ఆపరేషన్స్ హెడ్ అభిషేక్ పాధ్యే పేర్కొన్నారు. గురువారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దేశంలోని టైర్2,3 నగరాల్లో తమ కార్యక్రలాపాలను వేగంగా విస్తరించేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా నేడు రాజమహేంద్రవరం, నెల్లూరు నగరాల్లో తమ డబెర్ బైక్ రైడ్ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. లక్షలాది మంది వినియోదారులకు నాణ్యమైన రవాణా సేవలను అందించటంతో పాటూ వేలమంది నిరుద్యోగులకు ఉపాది అవకాలు తమ సంస్థ కల్పించటం జరిగిందన్నారు. ఇండియా టూ ఆభాత్‌లో డ్రైవర్ల ఆదాయ వనరులను కూడా పెంచటం జరిగిందన్నారు. రాజమండ్రి, నెల్లూరుల్లో తమ సేవలు ప్రారంభించటం ద్వారా వినియోగదారులకు మెరుగైన ప్రయాన సౌకర్యాన్ని కల్పిన వారం అవుతామన్నారు. విభిన్న ఇంట్రాసిటీ, ఇంటర్ సిటీ ల ప్రయాణ అవసరాలు తీర్చేందుకు తమ సంస్థద్వారా టూ వీలర్, త్రీ వీలర్ వాహనాలను బుక్ చేసుకుని సుఖవంతమైన, సేఫ్ రైడ్ పొందవచ్చ న్నారు. ఇందుకోసం తమ యాప్ ను వినియోగదారులు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. యాప్‌లో రైడ్ బుక్ చేసుకున్న సెకను నుండి ఖచితమైన జీపిఎస్ ట్రాకింగ్, భద్రతను వినియోగదారులకు అందించటం జరుగుతుందన్నారు. అందరూ తమను ఆదరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో పర్యటించిన ఆర్డిఓ మధులత



ఉదయగిరి,జులై 11,ప్రభాతవార్త: ఉదయగిరి మండలంలోని పలు ప్రాంతాలలో ఆర్డీవో మదులత ఆకస్మిక తనిఖీని నిర్వహించారు.ఈ సందర్భంగా మీ ముందుగా ఉదయగిరి లోనే ఆనకట్ట వద్ద ఉన్న ఆర్టీసీ అతిథి గృహాన్ని సందర్శించి పక్కనే నిర్మించిన గుడిని పరిశీలించారు.ఆర్టీసీ శాఖ అధికారులు ఇరిగేషన్ శాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమంగా గుడి నిర్మాణం జరుగుతుందని గుడి నిర్మాణం జరిగిన ప్రాంతం ఆర్టీసీకి సంబంధించిందని తెలియజేయడంతో ఆమె దానిని పరిశీలించి తగు చర్య నిమిత్తం ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తామని అన్నారు.అనంతరం శకునాలపల్లి కుర్రపల్లి గ్రామాలలో జాతీయ రహదారులు భూములు కోల్పోయిన ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఇన్చార్జి ఎమ్మార్వో వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐఐటి ఫలితాల్లో జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

వింజమూరు,జులై11,ప్రభాతవార్త :వింజమూరు బాలుర ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం వెలువడిన ఐఐఐటి ఫలితాల్లో 9మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య తెలిపారు. పాఠశాలకు చెందిన వై.నిఖిల్, కె.జాన్సన్, జి.పురంధరేశ్వరి, ఎం.దీప్తి లు నూజివీడు ఐఐఐటికి, షేక్ సమ్మద్ , ఎస్.లక్ష్మి, ఎస్.అవినాష్, పి.నిషిత , పి.మనోరంజని , ఆర్‌కెవాలీ ఐఐఐటికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యార్థులను కన్న బిడ్డలుగా భావించాలి



**కోవూరు జులై 10 ప్రభాతవార్త :** సాంఘిక సంక్షేమ బీసీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులను తమ కన్నబిడ్డలుగా ప్రతి సంక్షేమాధికారి భావించాలని జిల్లా బీసీ సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి వై. వెంకటయ్య అన్నారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ బీసీ వసతి గృహాలను గురువారం ఉదయం ఆయన ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. సమాజాభివృద్ధిలో చదువే కీలకమని, ప్రతి విద్యార్థి తప్పక చదువుకోవాలన్నారు. సంక్షేమాధికారులు వారి వారి పరిధిలో ఉన్న వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చొరవ తీసుకోవాలన్నారు. పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో కీలకమని, ఆద శలోనే విద్యార్థులు పట్టుదలతో నూరుశాతం ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వసతి గృహాల్లో నెలకొని ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని సకాలంలో పరిష్కరించేలా చొరవ తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ప్రత్యేకంగా సమీక్షించి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పెడుతున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారులు జి. వెంకట్రావు, ఆర్. పద్మ, సుప్రజ, ఎంకే జ్యోతిరాణి, తదితరులు ఉన్నారు.

## పపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓవెల్ మినర్వా విద్యార్థులు ర్యాలీ




**కావలి, జులై 11 ప్రభాతవార్త** ప్రపంచ జనా భా దినోత్సవాన్ని పురస్కరించుకుని కావలి పట్టణంలోని ఓవెల్ మినర్వా పాఠశాల విద్యా ర్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభిం చారు. ఈ ర్యాలీ పాఠశాల నుండి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు నిర్వహించారు. విద్యా ర్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యా యులు నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమి షనర్ జి.శ్రావణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ.శివయ్యలు మాట్లాడారు. జనాభా నియంత్రణ, దాని ప్రయోజనాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎజియం జయదేవ్, ఇన్‌చార్జులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కావలి పట్టణంలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం



కావలి,జులై 11 ప్రభాతవార్త కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో అనేక ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాలలో కాలువలలో పేరుకుపోయిన పూడికను తొలగించడం, రోడ్లకు ఇరువైపుల పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. మురికి కాలువలలో నీటి పారుదలకు చర్యలు చేపట్టామన్నారు. రోడ్లకు ఇరువైపుల పిచ్చి మొక్కలు వుండటంతో రోడ్లు కుంచించుకుపోయాయన్నారు. పిచ్చి మొక్కలు తొలగించి రోడ్లను వెడల్పు చేయించడం, ఇతర అభివృద్ధి పనులు పర్యవేక్షించి అధికారులకు, సిబ్బందికి తగిన సలహాలు,సూచనలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలలో ఆయా ప్రాంతాల వార్డు ఇన్‌చార్జులు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఆక్రమణలో ఉన్న దారి సమస్య పరిష్కారం



**సైదాపురం, జులై 11, ప్రభాతవార్త** ఎన్నో ఏళ్లుగా ఆక్రమణకు గురైన రహదారి సమస్యను టీడీపీ నాయకులతో కలిసి రెవెన్యూ అధికారులు పరిష్కరించారు. మండల పరిధిలోని గిద్దలూరు నుండి ఆదూరుపల్లి గ్రామానికి పొలాలకు వెళ్లే దారి కొంత మంది రైతులు ఎన్నో ఏళ్లుగా ఆక్రమించుకుని ఉన్నారు. దీంతో ఎన్నికల ప్రచారంలో వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు గ్రామ రైతులు, నాయకులు ఆక్రమణలో ఉన్న రహదారి సమస్యపై ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో ఆయన సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు పాములూరు శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి దారి సమస్యను తొలగించి పరిష్కరించారు. దీంతో శుక్రవారం జేసీబీలతో రహదారి ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. దారి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. నాయకులు కల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, రైతులు ఉన్నారు.

## అంగన్వాడి సెంటర్లలో అవకతవకలు



ఉదయగిరి,జులై 11,ప్రభాతవార్త: మండల కేంద్రమైన ఉదయగిరిలోని ఐసిడిఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ సుజనా ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ మధ్య కాలంలో ఉదయగిరి సెక్టర్ లోని ఉదయగిరి సీతారాంపురం దుత్తలూరు వరికుంటపాటు మండలాలకు సంబంధించిన అంగన్వాడి సెంటర్లలో జరుగుతున్న అవకతవకల మీద మరియు సిబ్బంది యొక్క వస్తున్నా ఆరోపణల మీద సూపర్వైజర్ల పనితీరు మీద విచారణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిభందనలకు లోబడి సెంటర్లను సక్రమంగా నిర్వహించకపోతే సిబ్బంది మీద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇస్తూ సూపర్వైజర్ల పనితీరు ఆందోళనకరంగా ఉందని పద్దతి మార్చుకోకపోతే ఉన్నత అధికారులకు కంప్లైంట్ ఇవ్వాల్సి వస్తుందని అన్నారు.పలు అంగన్వాడి సెంటర్లలో అంగన్వాడి సిబ్బంది నెలల తరబడి వేరే రాష్ట్రాలలో ఉన్న వారికి సూపర్వైజర్లు జీతాలు వేస్తున్నారని..పక్క పంచాయతీ పిల్లలను తమ సెంటర్లలో నమోదు చేసుకొని సంఖ్య పెంచుకోవడానికి కొంతమంది అంగన్వాడి కార్యకర్తలు తమ ఇష్టానుసారం నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని అన్నారు.అంతే కాకుండా సమయపాలన ఎక్కడ పాటించడం లేదని నచ్చితే సెంటర్ కి రావడం లేకపోతే రాకపోవడం లాంటి కార్యక్రమాలు అంగన్వాడి సెంటర్లలో జరుగుతుందని కనీసం లీవ్ లెటర్ కుడా సిద్ధం చేసుకుని సూపర్వైజర్ అంగన్వాడి సెంటర్లను నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆరోపించారు.అంగన్వాడి సెంటర్లలో కనీస వసతులు పట్టించుకోకుండా తమ జీవితాలకు మాత్రం బిల్లులు పెట్టుకొని పని దినాలను చూపించుకొని సెంటర్లను గాలికి వదిలేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకవచ్చారు.పలు ఆరోపణలు వచ్చిన సందర్భంగా అంగన్వాడి సెంటర్ల సూపర్వైజర్లను కార్యకర్తలను గట్టిగా హెచ్చరిస్తూ పలు సూచనలు చేశారు.అంతేకాకుండా కొంతమంది అంగన్వాడి కార్యకర్తలు తమకు ఉన్నతాధికారులు తెలుసునని రాజకీయంగా యూరియన్లుగా విడిపోయి వివిధ కార్యక్రమాల ద్వారా అనేక విధాలుగా సెంటర్లకు చెడ్డపేరు తేవద్దని అలాంటి వారి పైన శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిడిపిఓ పద్మ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.